క్లుప్తంగా

యూపీహెచ్‌సీలో వసతులపై ఆరా



యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: కాకినాడ గాంధీనగర్, రామారావుపేటలలోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శనివారం సందర్శించారు. ఆయా యూపీహెచ్‌సీలలో అందుతున్న వైద్యసేవలను ఆరా తీశారు. అందుబాటులో ఉన్న వసతులు, కల్పించాల్సిన సౌకర్యాలను అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యకేంద్రాల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జె.వెంకటరావు మాట్లాడుతూ ప్రజలకు చేరువగా వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది సైతం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట డీఈ సుబ్బారావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు సేవా దృక్పథం అవసరం

కాకినాడ సిటీ: ప్రతి విద్యార్థి సేవా దృక్పథం అలవర్చుకోవాలని రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షులు గోపీ కాశీవిశ్వనాథ్ అన్నారు. శనివారం కాకినాడ రోటరీ క్లబ్‌లో జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రపంచశాంతిలో యువత పాత్ర అనే విషయంపై ఈ పోటీలు జరిగాయి. 23 పాఠశాలల నుంచి 214 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచి నైతిక విలువలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అదే విధంగా ఉత్తమ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. విజేతలకు 29వ తేదీన బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కాకినాడ కార్యదర్శి అరిగెల బాబి, రోటరీ ఇంటరాక్ట్ చైర్మన్ పీవీ సుబ్బారావు, రోటరీ క్లబ్ సభ్యులు నేమాని ప్రసాద్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో అంగన్‌వాడీ సెంటర్లలో ఖాళీగా ఉన్న సహాయకులు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కాకినాడ రూరల్ సీడీపీఓ వై.లక్ష్మి శనివారం పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం తూరంగి గ్రామంలో తూరంగి–3 అంగన్‌వాడీ సెంటర్‌కు ఎస్సీ మహిళ, రమణయ్యపేట గ్రామంలో రమణయ్యపేట–1 సెంటర్‌కు జనరల్ మహిళ, కరప మండలం పెదకొత్తూరు అంగన్‌వాడీ సెంటరు బీసీ–బి, వేలంగి గ్రామంలో వేలంగి–4 సెంటర్ నుంచి ఓసీ జనరల్ మహిళ నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు సర్పవరంలోని రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద దరఖాస్తులు అందజేయాలన్నారు.

నేడు శాంతి హోమం

సామర్లకోట: మండల పరిధిలోని గొంచాల గ్రామంలో రామమందిరం నిర్మాణం అవుతున్న ప్రదేశంలో ఆదివారం ఉదయం శాంతి హోమం జరుగుతుందని భద్రచలం పాదయాత్ర కమిటీ నాయకుడు వాసుదేవ సుబ్బారావు తెలిపారు. గొంచాల గ్రామం నుంచి ఈ నెల 4వ తేదీన సుమారు 400 మంది భక్తులతో కాలినడకన శ్రీరామ రథంతో భద్రాచలం పాదయాత్ర చేసి తిరిగి వచ్చిన సందర్భంగా ఈ హోమం నిర్వహిస్తున్నట్లు పాదయాత్ర కమిటీ నాయకుడు వాసుదేవ సుబ్బారావు తెలిపారు. ఉదయం భక్తులచే పూజలు, అనంతరం హోమం, తదుపరి భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు.

రత్నగిరిపై 22న సరస్వతీ పూజ

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 22న సరస్వతీ పూజ నిర్వహించి విద్యార్థులకు సత్యకలములు, కంకణాలు బహూకరించనున్నట్లు ఆలయ అధికారులు శనివారం తెలిపారు. అన్నవరం, పరిసర గ్రామాల విద్యార్థులు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి
- ఉత్తమ సేవకులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ పద్మశ్రీ, కమిషనర్ వెంకటరావు తదితరులు

కాకినాడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్ల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాగిరెడ్డి కళాక్షేత్రంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం 'వలంటీర్లకు వందనం' నిర్వహించారు.

ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలకు ఎంపిక చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్ర కళాదీప్తి, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యునిగా మమేకమై తెల్లవారకముందే వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను అందజేయడంతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అత్యంత క్రియాశీలకంగా పని చేస్తున్నారన్నారు. అటువంటి సేవా సారథులను కించపరిచేలా ప్రతిపక్ష టీడీపీ చేస్తున్న విమర్శలు శోచనీయమన్నారు. వీరి అమూల్యమైన సేవలను గుర్తించిన సీఎం జగన్ త్వరలోనే మరింత న్యాయం చేస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ చిట్టచివరి పేద లబ్ధిదారునికి కూడా సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్ల సేవలు అమోఘమన్నారు.

కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి మాట్లాడుతూ జగనన్న సైన్యంగా వలంటీర్లు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మాట్లాడుతూ కాకినాడ కార్పొరేషన్ పరిధిలో సుమారు 1543 మంది వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాల ద్వారా సుమారు రూ.2.81 కోట్ల లబ్ధిని ప్రభుత్వం అందిస్తోందన్నారు. సమావేశం అనంతరం పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్ స్వాగతోపన్యాసం చేయగా నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు కంపర బాబి, నల్లబిల్లి సుజాత, బొర్రా రమణ, పలక సూర్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, పలువురు నాయకులు, కార్యకర్తలు వివిధ డివిజన్ల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత పైనా అభాండాలేనా!

- బుద్ధిమారని మాజీ ఎమ్మెల్యే వనమాడి
- పద్ధతి మారకపోతే ఉపేక్షించేది లేదు
- కొండబాబుపై ద్వారంపూడి ఫైర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: లోకకల్యాణార్థం నిర్వహించిన పద్మావతి శ్రీనివాసుల కల్యాణోత్సవాన్ని, వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రాజకీయ లబ్ధికోసం దిగజారి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. మిడిమిడి జ్ఞానం, అవగాహనలేమితో చేస్తున్న విమర్శలకు రాజకీయాల్లో ఉండడం వల్ల వివరణ ఇవ్వాల్సి వస్తోందన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ద్వారంపూడి మాట్లాడుతూ సాంబమూర్తినగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని తన కుటుంబ సభ్యుల ద్వారా సమీకరించి రూ.4 కోట్లు ఖర్చుచేసి రాతి కట్టుతో నిర్మించినట్టు తెలిపారు. టీటీడీ నుంచి రూ.కోటి విడుదలైనప్పటికీ ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదని, ఆ సొమ్మును భవిష్యత్‌లో ఆలయ అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేస్తానని స్పష్టం చేశారు. తాను కొండబాబులా అవినీతి చేసి ఆస్తులు సంపాదించాలనే కాంక్షతో రాజకీయాల్లోకి రాలేదని పేర్కొన్నారు. కోటి రూపాయల ఖర్చుకు రూ.10 కోట్లు వసూలు చేసే కుటుంబం కొండబాబుదేనని ఈ విషయం ప్రజలకు కూడా తెలుసన్నారు. రాజకీయాలకు దూరంగా నిర్వహించిన కల్యాణంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా పాస్‌లు జారీ చేశామన్నారు. 2002లో ఇదే తరహాలో కల్యాణం చేయించానని వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాక మరోసారి వేడుకగా కల్యాణం చేస్తానన్నారు. రానున్న ఎన్నికలు అవినీతిపరుడైన కొండబాబు, నిజాయితీగా సేవలందిస్తున్న తనకు మధ్య జరుగుతున్నట్టు అభివర్ణించారు.

దొంగ ఓట్లంటూ దుష్ప్రచారం

ఓటమి భయంతో తాను దొంగ ఓట్లు చేర్పిస్తున్నానంటూ వనమాడి చేస్తున్న విమర్శలపై ద్వారంపూడి మండిపడ్డారు. ప్రజాబలంతో గెలిచే సత్తా తనకు ఉందని, వక్రమార్గంలో ఓట్లు చేర్పించాల్సిన అవసరం తనకు లేదన్నారు. చనిపోయినవారి ఓట్లు రెండు మూడుచోట్ల తొలగిస్తే దానిని కూడా రాజకీయం చేస్తున్నారన్నారు.

అన్ని మతాలను గౌరవిస్తా

సన్నిహితులతో కాలి నడకన తిరుపతి, సింహాచలం పాదయాత్ర, తిరుపతి వెంకన్న కల్యాణోత్సవాలు నిర్వహించిన తాను అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి స్పష్టం చేశారు. రాజకీయాల్లో కొనసాగుతున్న తాను ముస్లింల కోసం కొత్త మసీదుల నిర్మాణం, షాదీఖానాలు, శ్మశానవాటికలను అభివృద్ధి చేశానని చెప్పారు. అదే సమయంలో క్రైస్తవులకు కమ్యూనిటీహాళ్ల నిర్మాణంతోపాటు చర్చిల అభివృద్ధికి సొంతనిధులు కూడా వెచ్చించానన్నారు. త్వరలోనే రాతికట్టడంతో జగన్నాథపురం శివాలయం కూడా సిద్ధమవుతోందన్నారు.

స్వామి ఆశీస్సులతో వేడుకగా కల్యాణం

- ఎంతో మంది స్వచ్ఛంద సేవలందించారు
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతోనే కాకినాడలో పద్మావతి శ్రీనివాసుల కల్యాణోత్సవం వైభవంగా సాగిందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ప్రవచన కర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ఆశీస్సులతో ఆగమపండితులు గోపినంబాల శేషాచార్యుల బృందం శాస్త్రోక్తంగా కల్యాణవేడుకను నిర్వహించారని చెప్పారు. ఇటువంటి కల్యాణోత్సవాన్ని కాకినాడలో రెండోసారి నిర్వహించే చక్కని అవకాశం స్వామి ఆశీస్సుల వల్ల తనకు దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని విధాలా ఏర్పాట్లు చేసిన నాయకులు, కార్యకర్తలు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాలు, శ్యామ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన యువతీయువకులు, ఇతర నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

ఉద్యానంలో వడివడిగా..

- కరప గ్రామస్తులకు వాకింగ్ ట్రాక్
- రూ.1.3 కోట్లతో సుందరీకరణ
- నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కురసాల
- చురుగ్గా ముగింపు పనులు



కరపలో సామూహిక రక్షిత నీటి చెరువు చుట్టూ నిర్మించిన కురసాల కన్నబాబు పార్కు

కరప: గ్రామస్తులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వాకింగ్ ట్రాక్ వినియోగంలోకి రావడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని సామూహిక రక్షిత నీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి, విద్యుదీకరించి, పార్కు నిర్మిస్తామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇచ్చిన హామీ మేరకు రూ.1.3 కోట్లు మంజూరుచేయగా, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ప్రత్యేకశ్రద్ధతో పనులు చేయించారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ మొక్కలు వేయడం మినహా పనులు పూర్తయ్యాయి.

అందరికీ ప్రయోజనం

ఈ కాలంలో చాలామంది ఉదయాన్నే లేచి, ఒక గంట యోగా, నడక వంటి వ్యాయామాలు చేయడం దైనందిన జీవితంలో ఒక భాగంగా మారింది. హైస్కూలు గ్రౌండ్‌లో కొందరు, కాకినాడ–రామచంద్రపురం రోడ్డు, కరప–కొరుపల్లి రోడ్డుపై కొందరు నడకను అలవాటు చేసుకున్నారు. మరి కొంతమంది తాగునీటి చెరువు చుట్టూ ఉదయం, సాయంత్రం వేళల్లో నడుస్తున్నారు. అయితే ఈ చెరువు చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి, నడవడానికి అసౌకర్యంగా తయారైంది. ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే కన్నబాబు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. చెరువు చుట్టూ, గ్రావెల్ వేసి, నాలుగు పక్కలా విద్యుత్ స్తంభాలు వేసి, లైట్లు అమర్చారు. ట్రాక్‌కు కొంతభాగంలో వివిధ రకాల పూల మొక్కలతో పార్కు నిర్మిస్తున్నారు. వ్యాయామ సామగ్రి వచ్చిందని, రెండుమూడు రోజుల్లో వాటిని అమర్చనున్నట్టు ఎమ్మెల్యే కన్నబాబు తెలిపారు.



కరపలో నిర్మించిన వాకింగ్ ట్రాక్

అందరికీ ఉపయోగం



వాకింగ్ ట్రాక్ అందరికీ చాలా ఉపయోగకరమైనది. ఎమ్మెల్యే పనితీరుకు గుర్తింపుగా కురసాల కన్నబాబు పార్కుగా నామకరణం చేశాం. వారంరోజుల క్రితమే ఎమ్మెల్యే కన్నబాబు, అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ప్రారంభించడంతో, వినియోగంలోకి వచ్చింది.

– యాళ్ల సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు, కరప

ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో వాకింగ్ ట్రాక్



గ్రామంలో సరైన వాకింగ్ ట్రాక్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ట్రాక్ కరప, పేపకాయలపాలెం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ, కరప

తోబుట్టువుల అనుబంధమే అమృతహస్తం

- ఆద్యంతం అలరించిన నాటిక
- తాటిపర్తిలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభం
- ప్రేక్షకులను కట్టిపడేసిన 'బంధం'



అమృతహస్తం నాటికలో ఓ సన్నివేశం



బంధం నాటికలో ఓ సన్నివేశం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శుక్రవారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికలో తొలిరోజు ప్రదర్శించిన అమృతహస్తం, బంధం నాటికలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. నిజజీవితంలో మనుషుల మధ్య అనుబంధాలను కళ్లకు కట్టినట్టు చూపించారు నటీనటులు.

అనుబంధాల ఆవశ్యకతను వివరిస్తూ..

ఒక తల్లి కడుపున పుట్టిన తోబుట్టువుల మధ్య ఉండే ప్రేమానుబంధం చాలా గొప్పది. ఆధునిక సమాజంలో మృగ్యమైపోతున్న ఇలాంటి అనుబంధాలను వదిలేస్తే ఎంత నష్టమో, అనుబంధాలు సమాజానికి ఎంత అవసరమో గుర్తు చేయడం అనే ఇతివృత్తంతో సాగిన నాటిక ఆద్యంతం ఆకట్టుకుంది. గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ఈ నాటికకు కావూరి సత్యనారాయణ రచన, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. కావూరి సత్యనారాయణ, ఏపూరి హరి, సరిత, మాధవి తమ నటనతో పాత్రలకు జీవం పోసి ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నారు.

మనిషి జీవితమే ఒక అను'బంధం'

మనిషి జీవితం బధంతో మొదలవుతుంది. తల్లిదండ్రులు, తోబుట్టువులు, మిత్రులు, గురువులు, శ్రేయోభిలాషులు, పెళ్లయ్యాకా పెళ్లాం బిడ్డలు, బంధువులు ఇలా ఎన్నో బంధాలు ముడిపడి ఉంటాయి. మనిషి జీవితంలో ఎదరయ్యే బంధాలు వాటి విలువలను తెలియజెప్పే కథాంశమే బంధం నాటిక. జీవితాంతం కలిసి ప్రయాణం చేసే భార్యభర్తల బంధం చాలా పటిష్టమైనది, విడదీయరానిది, వృద్ధాప్యంలో ఈ బంధం మరింత బలపడుతుందనే అంశాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్టు చూపించారు. విజయవాడకు చెందిన మైత్రి కళా నిలయం వారు ప్రదర్శించిన ఈ నాటికకు మాడుగుల రామకృష్ణ రచన, టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు. టీవీ పురుషోత్తం, ఎన్ఎస్‌కే ప్రసాద్, ఎం.రత్నకుమారి, రాధాకృష్ణ, పి బాబూరావు తదితరులు తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

మంత్రి కారుమూరి దృష్టికి డీలర్ల సమస్యలు



మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లయ్య. చిత్రంలో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల రేషన్ డీలర్ల సంఘ నేత నందిపాటి పల్లయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని వలసపాకల గ్రామానికి చెందిన పల్లయ్యను మంత్రికి కన్నబాబు పరిచయం చేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సమస్యలను ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

ఎన్నికల విధులకు సమాయత్తం కండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటరావు

- ఈఆర్వో వెంకటరావు ఆదేశం

కాకినాడ: త్వరలో జరగనున్న ఎన్నికలకు సమాయత్తం కావాలని నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఎన్నికల సిబ్బందికి సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం సాయంత్రం సెక్టోరల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, ఏఈఆర్వోలతో ఎన్నికల విధులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్, ఓటింగ్ సహా ఎన్నికల విధులను 15 కేటగిరీలుగా విభజించి విధులను అప్పగిస్తున్నామన్నారు. ఆయా విధుల్లో ఉన్న అధికారులు, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా అవసరమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఆయా అంశాలకు కల్పించాల్సిన సదుపాయాలు, అవసరాలపై నివేదిక సిద్ధం చేసుకోవాలని కోరారు. అలాగే 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, అంధులకు సంబంధించిన హోం ఓటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా విధులు నిర్వర్తించేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు.

పోలింగ్ స్టేషన్ల సందర్శన

ఈఆర్వో వెంకటరావు శనివారం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. అన్నమఘాటీ, పరదేశమ్మపేట, ఏటిమొగ, నేతాజీపార్కు, తిలక్‌వీధి, పోర్టు ఆఫీస్ ప్రాంతాల్లోని పీఎస్‌లలో కనీస మౌలిక సదుపాయాలు ఉన్నాయో లేదో ఆరా తీశారు. సదుపాయాల కొరత ఉంటే సత్వరమే తనకు నివేదిక ఇవ్వాలని అక్కడి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఓటర్లకు కానీ, విధుల్లో ఉన్న సిబ్బందికి గానీ ఎటువంటి అసౌకర్యం లేకుండా పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ప్రత్యేకాధికారులు, సెక్టోరల్ అధికారులు ఉన్నారు.

సాగునీటి సమస్య లేకుండా చర్యలు



పొలాలను పరిశీలించి సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి డీవీఎస్ హరి

- జిల్లా వ్యవసాయాధికారి హరి

సామర్లకోట: రైతులకు సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి డీవీఎస్ హరి అన్నారు. శనివారం సాయంత్రం మండల పరిధిలో మామిళ్లదొడ్డి, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల్లోని రైతుల పొలాలను ఆయన పరిశీలించారు. ఈ మేరకు సాగునీటి ఎద్దడిపై రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని హరి హామీ ఇచ్చారు. రైతుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని, ఈకెవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్బీకేల్లో ఎరువులు అందు బాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, విస్తరణాధికారి ఎంవీ సతీష్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన పెరగాలి



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సామర్లకోట: బాలికల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రొటెక్షన్ అధికారి జి.విజయ అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన, బాలల హక్కుల పరిరక్షణ, బాలలపై జరుగుతున్న వేధింపులను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలన్నారు. బాలలపై జరుగుతున్న చర్యలు తమ దృష్టికి వస్తే చైల్డ్‌లైన్ 1098, లేదా పోలీసు 100కు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.మంగాదేవి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం టి శ్యామ్‌సుందర్, అంగన్‌వాడీ టీచర్లు పి.సూర్యప్రభ, పి.సత్యనారాయణి పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



గాయపడిన రాజ్‌కుమార్

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజ్ కుమార్ శనివారం తీవ్రంగా గాయపడ్డారు. మధ్యాహ్నం ఇంటికి వెళ్తున్న సమయంలో పిఠాపురం రోడ్డులో గణపతిశాస్త్రి ఇంటి సమీపంలో మోటారు సైకిలుకు అడ్డుగా కుక్క రావడంతో ఒక్కసారిగా బ్రేక్ వేశారు. దీంతో ఆయన అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే అతనిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అంబులెన్సులో మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పంచారామ క్షేత్ర ఈఓగా నీలకంఠ



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయ ఈఓగా బర్ల నీలకంఠను నియమించారు. ఇప్పటి వరకు ఈఓగా పని చేసిన డి.నాగ మల్లేశ్వరరావు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతిపై కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. అంతర్వేదిలో లక్ష్మీ నృసింహస్వామి కల్యాణ ఉత్సవాలు ఉండటంతో ఆయన వెంటనే బాధ్యతలు స్వీకరించారు. పంచారామ క్షేత్రంలో మార్చి 6 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు, స్వామి వారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు సీనియర్ ఈఓ అయిన నిడదవోలులోని కోట సత్తెమ్మ తల్లి ఆలయ ఈఓగా పని చేస్తున్న నీలకంఠను ఇక్కడకు బదిలీ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ నుంచి శనివారం ఉత్తర్వులు వచ్చాయి. సోమవారం నీలకంఠ బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న అమెరికన్లు



హనుమాన్ సన్నిధిలో అమెరికన్లు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వేంచేసిన కార్యసిద్ధి హనుమాన్ (ఆంజనేయస్వామి)ని శనివారం అమెరికాకు చెందిన ఎం.మార్టిన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు వారికి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.